


14న పాఠశాలల్లో మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్

పార్వతీపురం : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నవంబర్ 14న మెగా ఉపాధ్యాయుల - తల్లి తండ్రుల సమావేశాలను (మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్) నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నవంబరు 14న బాలల దినోత్సవం రోజున ఈ సమావేశాలు జిల్లాలోని ప్రతి పాఠశాలలో చేపట్టాలన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం, మెరుగైన ఫలితాలు సాధించడం, పాఠశాల అభివృద్ధికి సరికొత్త ఆలోచనలు చేయడం దీని ముఖ్యోద్దేశ్యమని చెప్పారు. సమావేశాల్లో విద్య, క్రీడలు, న్యూట్రీ గార్డెన్, మై స్కూల్ - మై ప్రైడ్ వంటి అంశాలపై చర్చించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.



బదిలీ అయినా
వదల బొమ్మాళీ అంటున్న ఓ అధికారి

- అప్పుడూ, ఇప్పుడూ ఆయనే నెంబర్ టూ
- జిల్లా బాస్‌లను మచ్చిక చేసుకోవడంలో దిట్ట

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆయన అందరిలాగే ఓ జిల్లా అధికారి.. జిల్లాలో 50కి పైగా శాఖల అధికారుల్లో ఆయనొకరు... కానీ ఆయన రూటే సపరేట్... మన్యం ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడే తిష్ట వేసి వున్నారు. బదిలీ అయి నెలలు గడిచినా ఆయన జిల్లా గడపదాటలేదు. కారణమేమిటో తెలుసా? జిల్లా బాస్‌లను మచ్చిక చేసుకోవడంలో ఆయన్ను మించిన వారు మరొకరు ఉండరు. తన కిందిస్థాయి సిబ్బందిపై జులుం ప్రదర్శించడంలో ఆరితేరిన అధికారిగా గుర్తింపు పొందారు. వైసిపి ప్రభుత్వ హయాంలో పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడింది. ఆయన జిల్లాకు ఓ కీలకమైన శాఖకు అధికారిగా వచ్చారు. అప్పటి జిల్లా కలెక్టర్‌కు ప్రీతిపాత్రమైన అధికారిగా గుర్తింపు పొందారు. కీలకమైన వ్యవహారాలన్నీ ఆయన ఈ అధికారికే అప్పగించే వారు. చివరికి ఆయనకు సంబంధం లేని ఆడుదాం ఆంధ్రా నిర్వహణకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు కూడా ఈ అధికారి కనుసన్నల్లోనే జరిగాయి. నాటి కలెక్టర్ జిల్లాలో ఉన్నంతకాలం ఆయన ఆడిందే ఆట, పాడిందే పాటలా సాగిపోయింది. అప్పుడే కాదండోయ్, ఇప్పుడు కూడా ఆయనే నెంబర్ టూ. ప్రస్తుత జిల్లా బాస్‌కు కూడా ఆయన ఇష్టమైన అధికారే, ఎంత ఇష్టమైన అధికారి అంటే ఆయనకు బదిలీ అయినా రిలీవ్ చేయకుండా ఇక్కడే వుంచారు. ఆయనతోపాటు బదిలీ అయిన అధికారులు రిలీవ్ అయి వెళ్లి పోయారు. కానీ ఆయన మాత్రం జిల్లాను వీడడం లేదు. మన్యం జిల్లాపై ఆయనకున్న ప్రేమ అలాంటిది. కొద్దినెలల క్రితం ఆయనని అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ జిల్లా అధికారిని ఇక్కడికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు బుట్టదాఖల య్యాయేమో అనిపిస్తోంది. దాదాపు మూడేళ్లుగా ఆయన జిల్లాకు అందిస్తున్న సేవలు బాగున్నాయనో, మరే కారణాల చేతనో ఆయన బదిలీ ఆగిపోయినట్లే. మరి కొన్నాళ్లు జిల్లాకు ఆయన సేవలు అవసరమని జిల్లా బాస్‌తో పాటు మంత్రి కూడా భావించడం వల్లనే బదిలీ ఆగిందనే ప్రచారం జరుగుతోంది.

జిల్లా బాస్‌లను బుట్టలో వేసుకోవడంలో ఆయన కున్న ప్రావీణ్యంతో పాటు రాజకీయ పలుకుబడి కూడా దండిగా వుంది. వైసిపి ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లా రాజకీయాలను శాసించిన అగ్రనేతలకు ఆయన దగ్గర బంధువు. వారి ఆశీస్సులతో ఆయన అప్పుడు జిల్లాలో బాగా చక్రం తిప్పారు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే ఇప్పుడు కూడా ఆయన చక్రం తిప్పే పరిస్థితి వుంది. ఆయన సొంత శాఖతో పాటు మరో కీలకమైన శాఖకు జిల్లా అధికారిగా ఇన్‌ఛార్జి బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. మరో గమ్మత్తైన విషయం ఏమిటంటే ఇప్పుడు న్న టిడిపి కూటమి ప్రభుత్వంలో కూడా ఆయనకు పలుకుబడి పుష్కలంగా ఉంది. పొరుగు జిల్లాకు చెందిన ఓ మంత్రి కూడా ఆయనకు సమీప బంధువే. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా నిర్వహణకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో భారీ చేతివాటం జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఆ కీలకమైన అధికారే ముఖ్య భూమిక పోషించారని టిడిపికి చెందిన జిల్లా ముఖ్య నేతలు ఫిర్యాదు కూడా చేసినా చర్యలు లేవు. అలాంటి జిల్లా అధికారి వెనుకబడిన మన్యం జిల్లాకు చాలా అవసరమని జిల్లా బాస్‌లు గుర్తించి ఆయన సేవలు కొనసాగించే ప్రయత్నం చేస్తుండడం చర్చనీయాంశమవుతోంది.

29న గాజువాకలో జరిగే
మహాధర్నాకు పాల రైతులంతా కదలిరండి

సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.అజయ్ కుమార్ గోడ పత్రిక విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించే పాలపై ధరలు తగ్గించడం చాలా అన్యాయమని, దీనివల్ల రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారని ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎపి పాల రైతుల సంఘం (ఎపి రైతు సంఘం అనుబంధం) రాష్ట్ర కార్యదర్శి కె.అజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఈనెల 29న గాజువాకలో జరిగే మహా ధర్నాకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ విశాఖ డెయిరీలో విక్రయిస్తున్న ఆవు పాలపై మూడు రూపాయల నుంచి నాలుగు రూపాయల వరకు ధరలు తగ్గించడం దారుణమన్నారు. ఇది రైతులపై, ప్రజలపై తీవ్రమైన భారంగా నిలుస్తుందన్నారు. ఇప్పటికే రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని, అసలు పాడి కూడా తీసేయాలనే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో విశాఖ డెయిరీ ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం అన్యాయమని మండిపడ్డారు. ప్రభుత్వం, డెయిరీ ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల భవిష్యత్తులో పాలు కల్తీతో పాటు, పసిపిల్లల్లో, మహిళల్లో, వృద్ధుల్లో పౌష్టికాహార లోపాలు ఎదురవుతాయని తెలిపారు. విశాఖ డెయిరీలో కంపెనీయేతరులు చొరబడటంవల్ల అధికారం మొత్తం కొంతమంది వ్యక్తులు చేజిక్కించుకొని తమకు ఇష్టం వచ్చినట్లు ధరలు తగ్గించుకొని, పోషణలు కూడా తగ్గిస్తున్నారని తెలిపారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని కొంతమంది దళారీ వ్యక్తుల వల్ల డెయిరీలో రకరకాల అవినీతి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అందుకనే రైతు సంఘం అనుబంధం పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న గాజువాక విశాఖ డెయిరీ ప్రధాన కేంద్రం వద్ద జరిగే మహాధర్నాకు పాల రైతులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం చొరబడి పాల రైతుల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని, పాలపై తగ్గించే ధరను వెంటనే పెంచాలని, డెయిరీని సొసైటీ చట్ట పరిధిలోకి తేవాలని, ప్రతి రెండు నెలకొకసారి బోనస్సులివ్వాలని, రైతులకు నష్టం జరిగే ఖర్చులను డెయిరే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు బంటు దాసు పాల్గొన్నారు.



మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘాల నాయకులు

నేడు మెగా రక్తదాన శిబిరం

పార్వతీపురంరూరల్ : పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాలు సందర్భంగా ఈనెల 28న (సోమవారం) మెగా రక్తదాన శిబిరాన్ని ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి ఆధ్వర్యంలో చాకలి బెలగాంలో గల సాయిబాబా మందిరం దగ్గరలో జరగనుందని పోలీస్ శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున పట్టణంలో గల యువకులు, స్వచ్ఛంద సంస్థలు, రక్తదాతలు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఆపదలో ఉన్న మరో నలుగురు ప్రాణాలు కాపాడాలని ఆకాంక్షించారు.


స్వర్ణోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

స్వర్ణోత్సవ సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - పార్వతీపురం

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా జిల్లాలో నవంబర్ 3న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తోట రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు కోరారు. ఈ మేరకు వారు ఆదివారం స్థానిక ఎన్జీవో హోం లో స్వర్ణోత్సవాల గోడ పత్రికలను ఉత్సవ ఆహ్వాన సంఘం చైర్మన్ గంటేడ గౌరు నాయుడు, ఎపి జెఎసి అమరావతి చైర్మన్ జి.శ్రీరామ్మూర్తి కలిసి విడుదల చేశారు. నవంబర్ 3న ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న సభకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, కార్యదర్శి, హెచ్ ఎం సంఘం నాయకులు పిసి హెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు జె.గోపాలపురంలో గ్రామసభ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రి సచివాలయ పరిధిలో గల జె.గోపాలపురంలో ఈనెల 28న భూ రీసర్వే సమస్యల పరిష్కార గ్రామసభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎన్నికల్లో ఆదరించి, ఆశీర్వదించి అత్యధిక మెజారిటీతో ప్రజలు గెలిపించి, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సమస్యలు తెలుసుకోవడమే ధ్యేయంగా ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వందలామంది ఫిర్యాదుదారులు తమ సమస్యలపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వీకరించిన సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాచిపెంట మండలం కొత్తూరు పంచాయితీ కొత్త పోలంవలస, పాత పోళంవలసకు చెందిన గిరిజనులు రహదారులు మంజూరు చేయాలని కోరారు. సాలూరు మండలం కందుల పథం పంచాయితీ తీనుసామంతవలస, మర్రివాని వలస గ్రామస్తులు వచ్చి తమ భూమిని కొంతమంది ఆక్రమించి తమ వ్యవసాయ పనులకు అడ్డుపడుతు న్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గల జిసిసి శాఖలో గిరిజనుల యావన్మంది తల్లిదండ్రులు పనిచేస్తూ కాలం చేశారని, వారి కుటుంబ సభ్యులతమైన తాము చదువుకొని నిరుద్యోగులుగా వున్నామని, కావున కారుణ్య నియామకాలు ద్వారా ఆ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. గిరిజన సంఘాల నుండి కొంతమంది గిరిజనులు వచ్చి గత ప్రభుత్వం గిరిజనులకు చాలా అన్యాయం చేసిందని ఈ ప్రభుత్వంలో న్యాయం చేయాలని మంత్రిని కోరారు. సాలూరు పట్టణం నుంచి సత్యసాయి ధ్యానమండలి సభ్యులు వచ్చి కాలుష్య నివారణకు నగర వనం నిర్మించేందుకు ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయిం చాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఆముదాల పారమేష్, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి కోతలు ప్రారంభం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నిడగలు మోర్జాపురం తదితర గ్రామాల్లో ఆదివారం కోతలు ప్రారంభించారు. ముందస్తుగా యదలు పంటకు రాగా, ఆదివారం నుంచి కోతలు ప్రారంభించారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో వరి పొలాలు ప్రస్తుతం కోతల దశలో ఉన్నాయి. వాతావరణం అనుకూలంగా ఉన్నందున వరి కోతలు కోసి పంటకు ప్రతిఫలం వస్తుందని రైతులు ఆనందంతో ఉన్నారు.


వరికోతల పనుల్లో నిమగ్నమైన మహిళలు

సవర చిత్రకళలో కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు సవర చిత్ర కళ మనసుమళ్లింది. దీంతో ఖాళీ సమయంలో కళను నేర్చుకోవడంలో నిమగ్నమయ్యారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే జిల్లా సంస్కృతి, వారసత్వాన్ని తెలుసుకుని అనేక విషయాల్లో వాటిని అన్వయించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో భాగంగానే స్వచ్ఛ సుందర పార్వతీపురం కాన్సెప్ట్‌ను ఆలోచించి, జిల్లా కేంద్రమైన పార్వతీపురం నుండి ప్రారంభించి సుందరమైన జిల్లాగా మార్చాలని ఆకాక్షిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం చెత్తకుప్పలా కనిపిస్తున్న ప్రదేశాలను శుభ్రం చేసి అక్కడ అచ్చుట సవర పెయింట్స్ ఉండేలా చర్యలు చేపడుతున్నారు. గత వారం పాఠశాలల కళలు , క్రాఫ్ట్ ఉపాధ్యాయులతో అవగాహన సదస్సు నిర్వహించారు. స్థలాలను శుభ్రపరచడం, వాటిని అందమైన ప్రదేశాలుగా మార్చడం, మంచి సవర పెయింట్స్ వేసి ఫంక్షన్ హాల్‌గా మార్చి ఉపయోగించుకొనుటకు కార్యాచరణ చేపడుతున్నారు. పలు గిరిజన గ్రామాల్లో అధికారిక పర్యటనల సందర్భంగా కలెక్టర్ సవర పెయింట్స్‌తో సాంప్రదాయక కనువిందులు చేసే గోడలను గమనించి సవర కళ వైపు ఆకర్షితులయ్యారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురానికి చెందిన గౌతమ్, సీతంపేటకు చెందిన రాజుకు కళలో నైపుణ్యం ఉందని తెలుసుకుని వారితో చర్చించారు. కళను నేర్చుకోవాలనే తన ఆసక్తిని వెల్లడించారు. వారు కొన్ని చిట్కాలు చెప్పడమే కాకుండా, ప్రాక్టీస్ కోసం కొన్ని స్కెచ్ బోర్డులను తయారు చేసి ఇచ్చారు. ఆదివారం, ఇతర రోజుల్లో విశ్రాంతి సమయం లభ్యమైతే సవర కళ వేయుటకు పెయింట్, కుంచె పట్టుకుంటున్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో బోర్డుపై కళను అభ్యసిస్తూ కనిపించారు. కళపై జిల్లా కలెక్టర్ ఆసక్తి పట్ల పలువురు ప్రశంసించారు.


గోడపై సవర చిత్రాలు వేస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికుల స్థానిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణికి మున్సిపల్ కార్మికుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇపిఎఫ్, పిఎఫ్ అమలులో లోపాలను సరిచేయాలని సాధారణ, ప్రమాద సమయంలో మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియో ఇవ్వాల, ఆప్కాస్ ద్వారా రిటైర్మెంట్ అయిన వారి పిల్లలకు ఉద్యోగం ఇవ్వాలనీ, పర్మినెంట్ ఉద్యోగులకు సరెండర్ లివులు, డిఎ బకాయిలు చెల్లించాలని, క్లాప్ వర్కర్స్ ఉద్యోగ భద్రత కల్పించాలని, సమ్మె కాలానికి జీతాలను ఇవ్వాలని, పండుగ కానుక వెయ్యి రూపాయిలు ను ఇవ్వాలని, విజయవాడ వరదల సమయంలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న సిబ్బందికి అదనంగా ఒక నెల జీతం ఇవ్వాలని, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలని, సుప్రీం కోర్టు సూచనల మేరకు కమిటీలను ఏర్పాటు చేయాలి, అందులో మహిళలకు చోటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ సాలూరు మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు టి.రాముడు, టి.శంకర్రావు, నాయకులు లక్ష్మి, రాము, గోవింద, సోములు, రామలక్ష్మి, బాజి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సంధ్యారాణికి వినతిని అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

పార్వతీపురం టౌన్ : మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ ఆధ్వర్యంలో కార్మికులు స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బోనుల గౌరీశ్వరి ఇంటికి వెళ్లి ఆమెకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని స్థానిక సమస్యలు, చట్టబద్ధమైన సమస్యలు పరిష్కారం కావడంలేదన్నారు. కార్మికులపై రోజురోజుకు పని భారం పెరుగుతుందని, దొడ్డిదారిన అధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్లల్లో పనులు చేయించుకుం టుందని అన్నారు. పాలకులు ఎంతమంది మారినా మున్సిపల్ కార్మికుల జీవితాలు మారడం లేదన్నారు. కావున మీరు ఈ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు ఈనెల 28న (సోమవారం) మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.సూరిబాబు, ఎన్. శంకర్రావు, ఎన్.మల్లేశ్వరరావు, ఎం.శివ, సిహెచ్ సింహాచలం, విజయ, లక్ష్మణరావు, ఆర్.తిరుపతి రావు, ఇ.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

వివిధ రకాల కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న గిరిజనుల కోసం పుష్పగిరి విట్రియో రెటీనా ఇనిస్టిట్యూట్ వారి సౌజన్యంతో సమాజ్ పరివర్తన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం దోనుబాయిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సమాజ్ పరివర్తన్ సొసైటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.నరేష్ తెలిపారు. దోనుబాయి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని, తీవ్ర కంటి చూపు సమస్యలకు ఉచిత ఆపరేషన్లు చేస్తారని తెలిపారు.

గతంలో పని చేసిన వారికే ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలోని పలు కెజిబివి పాఠశాల్లో భర్తీ చేస్తున్న బోధన, బోధనేతర పోస్టుల నియామకాల్లో గతంలో పనిచేసిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంమం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులతో సిఫార్సుతో ఉద్యోగాల భర్తీ జరుగుతుందనే వార్తల నేపథ్యంలో అటువంటి వాటికి అవకాశం లేకుండా పారదర్శకంగా పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


నచ్చిన మిల్లుకు ధాన్యం రవాణా చేసుకోవచ్చు

- రైతులకు 48 గంటల్లో బిల్లుల చెల్లింపు
- 'ప్రజాశక్తి'తో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు ముఖాముఖి

రానున్న సీజన్‌లో రైతులు వారికి నచ్చిన మిల్లుకు ధాన్యం రవాణా చేసుకోవచ్చునని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్, జిల్లా పౌరసరఫరాల ఇన్‌ఛార్జి అధికారి పి.శ్రీనివాసరావు చెప్పారు. అలాగే ధాన్యం అందించే రైతుకు 48గంటల్లో బిల్లులు చెలిస్తామన్నారు. ఈమేరకు ఆదివారం ఆయన 'ప్రజాశక్తి'తో ముఖాముఖి మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే...

-ప్రజాశక్తి , పార్వతీపురం





- **జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడు ప్రారంభిస్తారు? సేకరణ లక్ష్యం ఎంత?**

నవంబర్ రెండో వారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించే అవకాశం ఉంది. 2.2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం.

- **కొనుగోలు కేంద్రాలు ఎన్ని? మద్దతు ధర ఎంత?**

జిల్లాలో 183 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తాం. 306 రైతు సేవా కేంద్రాల సేకరణ చేస్తాం. వరి క్వింటాకు మద్దతు ధర సాధారణ రకం రూ.2300, గ్రేడ్-ఎ రకం అయితే రూ.2320.

- **ఏఏ సంస్థల ద్వారా కొనుగోలు చేస్తారు?**

జిల్లాలోని 105 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మిగిలినవి రైతు ఉత్పత్తి సంఘాలు, జిసిసిల ద్వారా కొనుగోళ్లు జరుగుతాయి.

- **గోనె సంచులు, హమాలీలు, రవాణా సమస్యలు ఎలా పరిష్కరిస్తారు?**

రైతులే గోనె సంచులు సమకూర్చుకోవాలి. 40కిలోల గోనెసంచికి 3.39రూపాయలు చెల్లిస్తాం, క్వింటాలుకు రవాణా ఛార్జీల కింద 17.17 రూపాయల చొప్పున చెల్లిస్తాం.

- **ధాన్యం కొనుగోలు తర్వాత ఎన్ని రోజులకు చెల్లింపులు చేస్తారు?**

48 గంటల్లో ఆధార్ ఆధారిత చెల్లింపు చేస్తాం. గతంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు ఈసారి రైతులకు ఉండవు. జిల్లాలో ఉన్న 93 రైస్ మిల్లుల్లో నచ్చిన మిల్లుకు ధాన్యం రవాణా చేసుకోవచ్చు. ధాన్యం రవాణాకు జిపిఎస్ ఉన్న వాహనాల అనుమతి ఉంటుంది.

- **ఈ ఏడాది సీజన్‌లో ధాన్యం ఎంత దిగుబడి వుంటుంది?**

జిల్లాలో ఈ ఏడాది సీజన్‌లో ధాన్యం 66లక్షల టన్నుల దిగుబడి వుండొచ్చునని అంచనా. దీనిలో 22 లక్షల టన్నుల ధాన్యం రైస్ మిల్లు లు ప్రభుత్వానికి సరఫరా చేయాలి.

- **దసరాకు కందిపప్పు ఎందుకు సరఫరా చేయలేదు?**

దసరా పండుగకు రేషన్ కార్డుదారులకు కిలో కందిపప్పు 67రూపాయలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే సకాలంలో కందిపప్పు సరిపడా సరఫరా కాకపోవడంతో పంపిణీ చేయలేదు. దీపావళికి పంపిణీ చేస్తాం.

- **ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీకి అర్హులెవరు?**

ప్రభుత్వం నిర్ణయించిన మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కి తెలుపు రేషన్ కార్డులంతా అర్హులే. గ్యాస్ కనెక్షన్లు ఉన్న వారందరికీ పంపిణీ జరుగుతుంది. జిల్లాలో 2.81లక్షల తెలుపు రేషన్ కార్డులు ఉన్నాయి.



దిక్సూచి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిఇఒ తిరుపతినాయుడు

దిక్సూచి పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - వీరఘట్టం

జిల్లా ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం సులభ తరమైన పద్ధతిలో చదవడానికి అనుగుణంగా తయారు చేసిన దిక్సూచి పుస్తకాన్ని డిఇఒ ఎన్.తిరుపతినాయుడు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం డిప్యూటీ డిఇఒ రాజ్ కుమార్, డిసిఇబి కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా సైన్సు అధికారి జి.లక్ష్మణరావు, సమగ్ర శిక్ష ఎఎస్ఒ హరిప్రసాద్, ఫోరం ప్రతినిధులు కుమార్ రావెల, సంతోష్ కుమార్, శైలజ, రామారావు, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదవడం మాకిష్టం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమం నిర్వహించినట్టు గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసుదనరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జీవిత చరిత్రను విద్యార్థులతో చదివించామన్నారు. అలాగే విద్యార్థులకు క్విజ్ పోటీలు, తెలుగు కవితలు, పద్యాలు, గద్యాల పోటీలతో పాటు కథల పోటీలు కూడా నిర్వహించారు. క్యారం బోర్డు, లూడో గేములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

మెగా ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని పెదమేరంగి కూడలిలో గల తిరుమల సాయి హైస్కూల్ యాజమాన్యం సహకారంతో శ్రీకాకుళం జిల్లా రాగోలు జెమ్స్ హాస్పటల్ సౌజన్యంతో ఆదివారం బిగ్ టీవీయ నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. ఈ మెగా వైద్య శిబిరానికి దీర్ఘకాలికంగా బాధపడుతున్న 250 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రాగోలు జెమ్స్ హాస్పటల్ వైద్యులు బిపి, షుగర్, ఇసిజి, తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తిరుమల సాయి స్కూల్ కరెస్పాండెంట్ వెంకటరమణ మాట్లాడుతూ బిగ్ టీవీ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం విజయవంతం కావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ కిరణ్ రెడ్డి, డాక్టర్ ధర్మా, కుసుమిత, ఏరియా మేనేజర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేటలో జనసేన జెండాను ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ జెండాను ఆవిష్కరించారు. తొలుత చినభోగిలి పెట్రోల్ బంకు నుండి జోగింపేట వరకు బైక్ రాలీ నిర్వహించి అనంతరం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి కార్యకర్తలకు జనసేన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎ.మోహనరావు, గేదెల సతీష్ కుమార్, కోట్ల కృష్ణ, ఎం.సురేష్, పైల సత్యన్నారాయణ, అల్లు రమేష్, పి.శ్రీనివాసరావు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్క్‌లో ఉన్న అందాలను ఆశ్వాదించారు. జల విహార వద్ద బోట్ షికారు చేశారు. గైరో ఎక్కి గుండ్రంగా తిరిగారు. యువకులు సాహసోపేత క్రీడతో సాహసం చేశారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి ఏచక్కగా ఆడుకున్నారు. అనంతరం మెట్టిగూడ జలపాతాన్ని సందర్శించి జలపాతాల్లో జలకాలాడారు. ఆడలి వ్యూ పాయింట్‌ను సందర్శించారు.

పడకేసిన పిహెచ్‌సి సేవలు

ప్రజాశక్తి -పాలకొండ

మండలంలోని అన్నవరం ప్రాథమిక వైద ఆరోగ్య కేంద్రం సేవలు పడకేశాయి. 24గంటలు వైద్య సేవలు అందించాల్సిన పిహెచ్‌సిలో రోగులకు అరకొరగా సేవలు అందుతున్నాయి. ఇద్దరు వైద్య అధికారులు ఉన్నప్పటికీ వారు అందుబాటులో లేరనే విమర్శలు విఁపిస్తున్నాయి. రోజుకు 50ఒపి ఉండగా, పది ఇన్ పేషంట్లు నమోదు అవుతున్నట్లు రికార్డుల్లో ఉన్నాయి. అయినప్పటికీ వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదనే విమర్శలు విఁపిస్తున్నాయి. ఫార్మసిస్ట్ పోస్ట్ గత కొంతకాలంగా ఖాళీగానే ఉంది. సిహెచ్ఒతో పాటు యుడిసి, ఇద్దరు సూపర్ వైజర్లు, స్టాఫ్ నర్స్, లాబ్ టెక్నీషియన్ ఉన్నారు. తరచూ వైద్యులు అందుబాటులో లేరు. దీంతో పిహెచ్‌సిలో ఏ విధంగా సేవలు అందుతున్నాయో అర్థమవుతుంది.



రోగుల్లేక బోసిపోయిన అన్నవరం పిహెచ్‌సి

ఇరుకైన గదిలో విధులు

పూర్తి కాని భవన నిర్మాణ పనులు
ఉద్యోగులకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి -వీరఘట్టం

వీరఘట్టంకు ఎంతో పేరు ప్రత్యేకతలు ఉన్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం అంత అంతే.. పేరుకే మేజర్ పంచాయతీ తప్ప కనీస సౌకర్యాలు లేకపోవడంతో సచివాలయాల ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయం వ్యవస్థలో భాగంగా ఉద్యోగులు పనిచేసేందుకు భవన నిర్మాణాలు పనులు చేపట్టారు. ఒక్కొక్క భవనానికి రూ.40 లక్షలతో ఉపాధి హామీ నిధులు వెచ్చించి పంచాయతీరాజ్ పర్యవేక్షణలో పనులు జరిగాయి. ఇందులో భాగంగా వీరఘట్టంకు మూడు సచివాలయ భవనాలు మంజూరయ్యాయి. వీటిలో ఒక్కటి కూడా పూర్తి కాలేదు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదార్లు భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో పాత పంచాయతీ కార్యాలయంలోనూ ఈ మూడు సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఒకే భవనంలో 1,2,3, సచివాలయాలు కొనసాగించడంతో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

అద్దె చెల్లించలేక సొంత కొంపకే

మూడు సచివాలయాలు ఒక చోటు ఉన్నందున ఉద్యోగులు, అర్జీదారులు ఇబ్బందులకు గురవుతున్న దృష్ట్యా 3,4సచివాలయాలను బిఎంఆర్ థియేటర్ సమీపంలోని ఓ అద్దె గృహంలో కొంతకాలం విధులు కొనసాగించారు. అద్దెలు కట్టుకోలేక మళ్లీ అక్కడి నుంచి ఇక్కడ సొంత భవనాలకు సామగ్రిని తీసుకువచ్చారు. అప్పట్లో సచివాలయాల ఏర్పాటు ఇందుకు సంబంధించిన సామాగ్రిని కూడా పంపిణీ చేశారు. కూడు లేదు గురువా అంటే చారు వేయు అన్న చందంగా ఉద్యోగులు విధులు నిర్వహించేందుకే సరైన భవన లేకపోగా,



స్లాబ్ లకే పరిమితమైన మూడు, నాలుగు సచివాలయాలు

దీనితోడు ప్రభుత్వం మంజూరు చేసిన సామాగ్రిని ఎక్కడ ఉంచాలో అర్థంకాని పరిస్థితిలో ఉద్యోగులు ఉన్నారు. అవసరమైన సామాగ్రిని ఉంచుకుని మిగిలిన సామాగ్రినంతా వేరే చోట భద్రం చేశారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కొన్న సామాగ్రిని భద్రపర్చడానికి స్థలం లేకపోవడంతో అవి ఎండకు ఎండి వానకు తడిసి తుప్పు పడుతున్నాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతుందని ఒక విధంగా చెప్పాలి.



ఇదే భవనంలోని మూడు సచివాలయాలు నిర్వహణ

అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణాలు

ప్రారంభమైన సచివాలయ భవన నిర్మాణాలు బిల్లులు మంజూరు కాక ఫిల్లర్లు, శ్లాబ్‌లకే పరిమితమయ్యాయి. రెండో సచివాలయం భవనం పనులు ప్లాస్టింగులకు పరిమితమైంది. గత ఐదేళ్లలో సచివాలయ భవన నిర్మాణ పనులు పూర్తి కాలేదంటే గత ప్రభుత్వం పనితీరు ఏ విధంగా ఉందో వీటిని చూస్తే అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా అర్ధాంతరంగా నిలిచిపోయిన సచివాలయ భవనాలు నిర్మాణ పనులు పూర్తి చేస్తుందా? లేక అసంపూర్తిగా నిలిపి వేస్తుందా? వేచి చూడాల్సి ఉంది. అర్ధాంతంగా విడిచిపెడితే లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైన అర్ధాంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణాలను పూర్తి చేసి, సచివాయ ఉద్యోగులు సజావుగా విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎపిఒ జి.సత్యం నాయుడు వద్ద 'ప్రజాశక్తి' ప్రస్తవించగా 80శాతం భవన నిర్మాణం పనులు పూర్తయితే వాటికి బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు వచ్చాయని, అసంపూర్తిగా ఉన్న భవనాలకు ఏ విధమైన ఆదేశాలు రాలేదని వివరణ ఇచ్చారు.

ధరలు అదిరే... జనం బెదిరే

ప్రజాశక్త - కురుపాం

కారణాలు ఏమైనా బియ్యం, ఉప్పు, పప్పు, వంట నూనెల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో ధరల పెరుగుదల పండగలపై ప్రత్యక్షంగా పడింది. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం, సంబంధిత అధికారులు ప్రకటనలు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉన్నట్లు విదితమౌతోంది. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యునికి భారంగా మారాయని చెప్పవచ్చు.



పెరిగిన నిత్యావసర ధరలు ఇలా

కంది పప్పు కిలో వారం రోజుల కిందట రూ.160 నుంచి రూ.165 ఉండగా, ఇప్పుడేమో రూ.170 నుంచి రూ.175కు చేరింది. పెసరపప్పు రూ.100 నుంచి రూ.120, రూ.130కి, మినప పప్పు రూ.125 నుంచి రూ.130, శెనగ పప్పు రూ.100 నుంచి రూ.110, పంచదార రూ.45 నుంచి రూ .50, గోధుమ నూక, గోధుమ పిండి రూ.35 నుంచి రూ.45, బెల్లం రూ.50 నుంచి రూ.55కు చేరాయి.

వంద లో 10 శాతం మందికి కంది పప్పు సరఫరా

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యాన ఎండియు వాహనాల ద్వారా తెల్లరేషన్ కార్డుదారులకు కిలో కంది పప్పు రూ.67కు పంపిణీ అరకొరగానే 10 శాతం మందికి అందినట్లు పలువురు కార్డుదారులు అంటున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో కంది పప్పు రూ.170 నుంచి రూ.176కు కొనలేక పోతున్నట్లు తెలిపారు

ధరలు తగ్గించాలి



అమాంతంగా పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో బతకడం కష్టంగా ఉంది. దీంతో పండగలు జరుపుకునే పరిస్థితి కూడా కనిపించడం లేదు. కావున ప్రభుత్వం స్పందించి ధరలను తగ్గించి మాలాంటి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆదుకోవాలి.

ఎం.పోబితా
నీలకంఠపురం (గ్రామం)

ధరల పెరుగుదల ఆందోళనగా ఉంది



నిత్యావసర వస్తువుల ధరలు కొని తినాలంటే మా లాంటి పేద గిరిజన కుటుంబాలకు చాలా ఇబ్బందిగా ఉంది. అరకొర ఆదాయాలతో రోజు వారీ జీవనం సాగిస్తున్నాం అలాంటిది పప్పు, ఉప్పు, బెల్లంనిత్యావసర వస్తువులు ధరలు పెరగడంతో ఎలా బతకాలి తెలియక ధరలుఆందోళన కలిగిస్తున్నాయి.

బిడ్డిక మీనా
వబ్బింగి (గ్రామం)

బియ్యం ధరలు

బియ్యం ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. 25 కిలోల బియ్యం బస్తా రూ.1500 నుంచి రూ.1550కు (బెల్ బ్రాండ్), కోకిల బ్రాండ్ రూ.1300 నుంచి రూ.1360కు, హిమాలయ రూ.1100 నుంచి రూ.1150కు, మైనా రూ.1150 నుంచి రూ.1200కు పెరిగాయి.

వంట నూనెలు సల సల

పామాయిల్ లీటరు రూ.100 నుంచి రూ.120, రూ.130, రిపండాయిల్ రూ.100 నుంచి రూ.120 నుంచి రూ.135కు, సన్ ఫ్లవర్ రూ.110 నుంచి రూ.120, రూ.135కు పెరిగాయి.

జిఒ 3ను పునరుద్ధరించండి

గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి నిర్వహించండి
మంత్రి సంధ్యారాణిని కలిసిన ఎజెఎసి నాయకులు

ప్రజాశక్తి - సాలూరు

గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే జిఒ 3ను పునరుద్ధరించాలని కోరుతూ ఆదివాసీ జెఎసి నాయకులు ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ జెఎసి జిల్లా ఉపాధ్యక్షులు కొండగొర్రి ఉదయ్ కుమార్, కార్యదర్శి మజ్జి నారాయణరావు ఆధ్వర్యాన నాయకులు సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిశారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించారు. షెడ్యూల్ గ్రామాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఏజెన్సీలో అనేకమంది గిరిజన యువకులు ఉపాధ్యాయ శిక్షణ పొంది ఉన్నారని, ఉద్యోగాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రత్యేక డిఎస్సీ నిర్వహించాలని కోరారు. ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమ డిడిలుగా ఆ శాఖకు సంబంధించిన అధికారులనే నియమించాలని కోరారు. దీనిపై మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ జీవో 3 స్థానంలో మరో కొత్త జీవో తీసుకురానున్నట్లు చెప్పారు. షెడ్యూల్ గ్రామాల సమస్య చాలా పెద్దదని, దాని పరిష్కారానికి కొంత సమయం కావాలని కోరారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలే అయిందని చెప్పారు. 16,400 ఉపాధ్యాయ పోస్టులతో ప్రభుత్వం డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిందని, వీటిలో గిరిజనులకు 1100 పోస్టులు ఉన్నాయని తెలిపారు. మంత్రి సంధ్యారాణిని కలిసిన వారిలో జెఎసి నాయకులు పల్లా సురేష్, అన్నారావు, గిరిజ,దుక్క సీతారాం వున్నారు.



మంత్రికి వినతిని అందజేస్తున్న గిరిజన జెఎసి నాయకులు

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని గొట్ట మంగళాపురంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, వీటిని నివారించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అధికారులను కోరారు. వంతెనకు 500 మీటర్లు దూరంలో ఇసుక తవ్వకాలు జరపాలని అధికారులు ఇటీవల కాలంలో ప్రకటించగా, ఇందుకు విరుద్ధంగా 300 మీటర్లు దూరంలోనే తవ్వకాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే మండలంలో నాగావళి నది సమీపంలో వుండే గ్రామాలు నుంచి ఇసుక ఉచితంగా తీసుకువెళ్లిలా చర్యలు చేపట్టి, అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని కోరారు. ఉచితంగా ఇసుక రవాణా చేసుకోవచ్చని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినప్పటికీ మండలంలో నాగావళి నదికి ఆనుకున్న గ్రామల్లో దళారీలు అక్రమ ఇసుక వ్యాపారం చేసుకుంటున్నారని, సమగ్రంగా పరిశీలించి అక్రమ ఇసుక వ్యాపారాన్ని అరికట్టాలని కోరారు. నాగావళి నదిలో గొట్ట మంగళాపురం ప్రాంతం నుంచి ఇసుక తవ్వకాలు పగలు రాత్రి జోరుగా కొనసాగుతున్నాయని, ఒక వైపు నాగావళి వంతెన అదే సమీపంలో ఉండగా, మరో వైపు రక్షిత మంచి నీటి పథకం ట్యాంక్ అతి సమీపంలో ఉందని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు ప్రభుత్వ అధికార యంత్రాంగం వంతెనకు 500 మీటర్లు హద్దులు ఏర్పాటు చేసి, ఉచితంగా ఇసుక తరలించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే పాలకొండ మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమంలో తీవ్రతం చేస్తామని అన్నారు.



డంపింగ్‌యార్డు వద్ద ఉన్న వేరు చేయని తడి, పాడి చెత్త

ఇదేనా తడి, పొడి చెత్త?

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి తడిచెత్త, పొడిచెత్త వేరు చేసి వేస్తామని అధికారులు, పాలకులు చెబుతున్నప్పటికీ శాశ్వతమైన డంపింగ్ యార్డు నేటికీ ఏర్పాటు చేసుకోలేకపోయారు. డివిజన్ కేంద్రమైన పాలకొండ నగర పంచాయతీకి డంపింగ్ యార్డు సమస్య ప్రధాన సమస్యగా మారింది. 2013లో మేజర్ పంచాయతీని నగర పంచాయతీగా మార్చినప్పటికీ నాటి నుంచి నేటి వరకు డంపింగ్ యార్డు ఏర్పాటు కాలేదు. మూడు ప్రభుత్వాలు మారాయి. రెండు పాలక వర్గాలు వచ్చాయి. సుమారు 12మంది కమిషనర్లు మారారు, అయినా ఈ డంపింగ్ యార్డు ఏర్పాటు కాలేదు. ఎక్కడికక్కడే అడ్డంకులు ఎదురవ్వడంతో నగర పంచాయతీకి డంపింగ్ యార్డు సమస్య గుదిబండగా మారింది. కొద్ది రోజుల నుంచి పట్టణం నడిబొడ్డున వెంకటరాయ కోనేరు వద్ద చెత్తను వేసి కాల్చేస్తున్నారు. దీనిపై స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తడి, పొడి చెత్తలను వేరు చేసి ఇక్కడ నుంచి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జెఎసి సమావేశాన్ని విజయవంతం చేయాలి

విజయనగరం టౌన్ : జోన్-1 పరిధిలోని జిల్లాల్లో ఉన్న పంచాయతీ రాజ్ అధికారులు, ఉద్యోగులతో నవంబర్‌లో జరిగే పంచాయత్ రాజ్ జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యలపై ఉమ్మడి అజెండా రూపొందించి, పరిష్కారానికి ప్రయత్నించనున్నట్లు వారు తెలిపారు.

సభ్యత్వ నమోదు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి టిడిపి కార్యకర్త పార్టీ సభ్యత్వ నమోదు చేసుకోవాలని కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. మండలంలోని లోవముత్తా ప్రాంతమైన రాయగడ జమ్ములో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొన్నారు. వంద రూపాయలతో సభ్యత్వం నమోదు చేసుకున్న కార్యకర్తలకు గతంలో ఉన్న రూ.2లక్షల బీమాను రూ.ఐదు లక్షలకు పెంచారన్నారు. సభ్యత నమోదు చేసుకున్న కార్యకర్తకు బీమాతో పాటు వారి కుటుంబ సభ్యులకు విద్య, వైద్య, ఉపాధి సహాయం కూడా పొందవచ్చన్నారు. పాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. పార్టీ సభ్యత్వం పొందిన వ్యక్తి మరణిస్తే మట్టి ఖర్చులకు తక్షణ సాయం కింద రూ.10వేలు అందుతుందన్నారు. నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ దేవ్, మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, నాయకులు దాసు, ధర్మారావు, కోటి, అనిబాబు, సీతారాం, రంజిత్ కుమార్, కొండయ్య, వంశీ, లోముత్తా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సీతానగరం : మండలంలోని కాసాయిపేట, అంటిపేట, గెడ్డలుప్పి, రంగంపేట తదితర గ్రామాల్లో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు టి.వెంకట అప్పలనాయుడు, టి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి పార్టీ సభ్యుడు సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని, సభ్యత్వం నమోదు చేసుకుంటే పార్టీ వారికి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏగిరెడ్డి భాస్కరరావు, గడ్డప్ప, కర్రి శంకర్రావు, సిహెచ్ సింహాచలంతో పాట తదితరులు పాల్గొన్నారు.

జెవివి ప్రతిభా పరీక్షలతో
వినూత్న ఆలోచనలకు బీజం
జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చెకుముకి సంబరాల పేరుతో జనవిజ్ఞాన వేదిక నిర్వహిస్తున్న ప్రతిభా పరీక్షలతో విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలకు బీజం పడుతోందని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి జిల్లా స్థాయి సంబరాలను జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెకుముకి ప్రశ్నపత్రాలను జెడ్‌పి చైర్మన్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని పెంచడమే లక్ష్యంగా జెవివి ప్రయత్నించడం అభినందనీయమన్నారు. సమాజాభివృద్ధి పట్ల ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, ఇంజినీర్లు, వైద్యులు, ఉద్యోగులు.. ఇలా అనేక మంది ఇటువంటి సంస్థలో పనిచేయడం, వారి సమయాన్ని వెచ్చించడం.. విద్యార్థులకు ఒక వరమని అభిప్రాయపడ్డారు.

జిల్లాలో వివిధ మండలాల నుంచి హాజరైన 34 బృందాల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి డెంకాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రయివేటు పాఠశాలల నుంచి విజయనగరంలోని ది నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానాల్లో నిలిచారు. వీరు నవంబర్ 9, 10న విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాల్లో పాల్గొంటారు. ముగింపు సభలో ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణులు సన్యాసమ్మ హాజరై, మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

ఈ సందర్భంగా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో డాక్టర్ చంద్రశేఖర్, పి.వేణుగోపాల్ చేసిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అచ్చిబాబు అనేక మ్యాజిక్‌లు చేసి, అందులోని మర్మాలను విద్యార్థులకు వివరించారు. ప్రజాకళాకారుడు డప్పు శ్రీను తన పాటలతో విద్యార్థులకు వినోదాన్ని పంచారు.

ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎంవిఎన్ వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పి.రమణ ప్రభాత్, సమతా కన్వీనర్ జి.నిర్మల, జిల్లా ఉపాధ్యక్షులు చీకటి దివాకర్, సత్యంనాయుడు, కె.మురళీబాబు, జిల్లా ట్రెజరర్ చెక్క సింహాచలం, నగర అధ్యక్షులు డాక్టర్ చిన్నారి, ప్రధానకార్యదర్శి శశిధర్, డాక్టర్ రమేశ్‌రాజు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



చెకుముకి ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు , జెవివి సభ్యులు